క్లుప్తంగా

డాక్టర్ గణేష్‌కు పలువురి పరామర్శ



రేపల్లె: అస్వస్థతకు గురై కోలుకుంటున్న వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్‌ను బుధవారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున పరామర్శించారు. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని గణేష్ స్వగృహంలో నాగార్జున గణేష్‌తో మాట్లాడారు. త్వరితగతిన కోలుకుని క్రియాశీల రాజకీయాలలోకి రావాలని నాగార్జున కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలోని మండల పార్టీ కన్వీనర్‌లు, నాయకులు గణేష్‌ను పరామర్శించారు.

శ్రీ కృష్ణుడి జీవితం మహా ప్రబోధం



భట్టిప్రోలు: శ్రీ కృష్ణ భగవానుడి జీవితం మహా ప్రబోధమని సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం భట్టిప్రోలులో శ్రావణ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని నగర సంకీర్తనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 16న కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, నిర్వాహకులు పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి వైఎస్సార్ సీపీ చేయూత

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామానికి చెందిన మద్దూరి ప్రతాప్ ప్రమాదవశాత్తూ మృతి చెందారు. బుధవారం మృతుని కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నాయకులు కర్రింశెట్టి బాలు పరామర్శించారు. అనంతరం మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందరరావు, పార్టీ నాయకులు బొజ్జా లాజర్, ఏసుబాబు, పీజీ అరుణ్‌శాస్త్రి, ఇస్సాక్, ఇమానియల్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మలేరియా విశ్రాంత అధికారి మృతి

భట్టిప్రోలు: భట్టిప్రోలు విఠలేశ్వరనగర్‌కు చెందిన 2003లో వైద్య శాఖ అసిస్టెంట్ మలేరియా విశ్రాంత అధికారి సయ్యద్ మొహుద్దీన్ భాషా(82) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈయనకు నలుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. భాషా ఎంపీహెచ్‌ఏగా పని చేస్తూ అసిస్టెంట్ మలేరియా అధికారిగా ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా భాషా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేసి పలువురు నివాళులు అర్పించారు. కాగా ఆయన భార్య కూడా ఇటీవలే మృతి చెందారు.

24న కార్పెంటర్స్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్పెంటర్స్(వడ్రంగి) అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈనెల 24న రైల్వే స్టేషన్ సమీప పూర్ణానందపేటలోని చాంద్ కల్యాణ మండపంలో జరుగుతుందని అసోసియేషన్ వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు కోడూరు వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. కార్పెంటర్స్ హక్కుల సాధనకు అందరూ కలిసి రావాలని కోరారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా కార్పెంటర్లకు కార్పొరేషన్ ఏర్పాటు, భవన నిర్మాణ సంక్షేమ మండలి బోర్డు పునరుద్ధరణ, మిషన్‌పై పని చేస్తున్నప్పుడు జరిగే ప్రమాదాలకు ఆరోగ్యశ్రీ వర్తింప చేయాలని కోరారు. ఫారెస్ట్ అధికారుల వేధింపులు నిలుపుదల చేయాలని, ప్రతి నియోజకవర్గంలో కార్పెంటర్లకు వర్క్ షాపులకు స్థలాలు కేటాయించాలని, కార్పెంటర్లకు సబ్సిడీ విద్యుత్ అందించాలని అన్నారు. కేటగిరి-1 లోనే పని చేసుకునే అవకాశం కల్పించాలని, రాజధాని అమరావతి నిర్మాణంలో ఆంధ్ర కార్పెంటర్లకు కాంట్రాక్టులు, సబ్ కాంట్రాక్టులు ఇవ్వాలని ఆయన వివరించారు.

పీ-4 సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలి



తెనాలి అర్బన్: పీ-4 సర్వేను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ఆదేశించారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని వార్డు ప్లానింగ్, వెల్ఫేర్ సెక్రటరీలతో మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా దీనిని నిర్వహిస్తోందని తెలిపారు. అందరూ తమ పరిధిలోని బంగారు కుటుంబాలను గుర్తించాలని సూచించారు. సమావేశంలో ఎసీపీ శివనారాయణ, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

పర్యావరణానికి ప్లాస్టిక్ ముప్పు!

- విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం
- మొక్కుబడిగా అధికారుల తనిఖీలు
- రేపల్లె పట్టణంలో క్రమేణా అధికమవుతున్న సమస్య



బస్టాండ్ సెంటర్‌లో బండిపై ప్లాస్టిక్ కవర్‌లో ఉన్న పళ్లు

రేపల్లె: పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న ముఖ్య కారకాలలో పాలిథిన్ కవర్ల వినియోగం ప్రధానమైంది. పాలిథిన్(ప్లాస్టిక్) జీవవైవిధ్యాన్ని నాశనం చేయడమే కాక.. మానవ ఆరోగ్యానికీ ముప్పుగా మారింది. పోలిమర్లు, మోనోమర్లు వంటి పునరుక్తమయ్యే రసాయన పదార్థాల సమ్మిళితంగా తయారయ్యే పాలిథిన్ వినియోగం నానాటికీ పెరిగిపోతూ పర్యావరణానికి హానికారిగా మారుతోంది. తక్కువ వ్యయంతో ఆకర్షణీయంగా తయారయ్యే ఈ పాలిథిన్(ప్లాస్టిక్) కవర్ల వినియోగంతో పర్యావరణానికి చేటు కానుంది.

పట్టణంలో విచ్చలవిడిగా వినియోగం..

రేపల్లె పట్టణంలో చిన్న వాణిజ్య వ్యాపారాలు, మార్కెట్లు, కూరగాయల షాపులు మొదలైనవి పాలిథిన్ కవర్లను అధికంగా ఉపయోగిస్తున్నాయి. ఫలితంగా తక్కువ మందమున్న పాలిథిన్ కూడా పర్యావరణానికి పెనుముప్పుగా మారుతుంది. మార్కెటుకు వెళ్లిన సమయంలో సాధారణ వస్తువుల్ని దుకాణాల యజమానులు పాలిథిన్ కవర్లతో ప్యాక్ చేసి ఇవ్వడం ప్రస్తుతం పరిపాటిగా మారింది. ఇవి చివరికి చెత్త బుట్టలోకి చేరి రహదారి పక్కనే ఉన్న కుండీలలోకి చేరుతోంది. ఎక్కడ పడితే అక్కడ ఈ పాలిథిన్‌ను పడవేయడంతో మురికి కాలువలు సైతం స్తంభించిపోతున్నాయి. పాలిథిన్‌కు నిప్పు పెట్టే ప్రక్రియతో విషపూరిత వాయువులు వెలువడి గాలి కాలుష్యానికి కారణమవుతోంది. దీంతో భూమిని కాపాడే ఓజోన్ పొర సైతం నాశనమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

మూగజీవాలపై ప్రభావం..

పాలిథిన్ వ్యర్థాలు చెత్తకుప్పలకు చేరిన తరువాత మూగజీవాలకు ఆహార పదార్థాలుగా మారుతున్నాయి. వాటిని తిన్న వెంటనే శ్వాసవ్యవస్థ పాడవ్వడంతో పాటు వాటి మరణానికి దారి తీస్తోంది. ఎక్కువగా ఆవులు, కుక్కలు, పందులు ప్లాస్టిక్ వ్యర్థాల్ని తీసుకుంటూ అనారోగ్య సమస్యలతో పాటు మృత్యువాత పడిన సంఘటనలూ నెలకొంటున్నాయి. ఒక్క రేపల్లె మున్సిపాలిటీలోనే రోజుకు 25 టన్నుల చెత్త పోగవుతుంటే.. అందులో 5 నుంచి 7 టన్నులు పైగా ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు ఉన్నాయంటే వినియోగం ఎంతలా ఉందో అర్థంచేసుకోవచ్చు. ఇప్పుడు ఈ సమస్య పల్లెలకు సైతం చాప కింద నీరులా సాగిపోతోంది.



పట్టణంలో కవర్ల వినియోగం

మొక్కుబడిగా అధికారుల తనిఖీలు..

పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ కవర్లను నియంత్రించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన ప్రతిసారి అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారు. ఒకటి, రెండు రోజులు పట్టణంలో హడావుడి చేస్తూ మొక్కుబడిగా ప్రచారం నిర్వహిస్తూ మమ అనిపిస్తున్నారు. దీంతో ఆ రెండు రోజుల తర్వాత అటు వ్యాపారులు.. ఇటు వినియోగదారులు అధికారుల కంటపడకుండా కవర్లను దాచి తర్వాత యథేచ్ఛగా విక్రయాలు, వినియోగాలు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ వస్తువులు వినియోగించాలి..

పాలిథిన్ కవర్లు, వస్తువులను వినియోగించరాదంటూ పలుమార్లు పట్టణంలో ఇప్పటికే ప్రచారం నిర్వహించాం. ఇక నుంచి విక్రయాలకు పాల్పడే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటాం. కవర్ల వినియోగం, విక్రయాలపై నిత్యం తనిఖీలు నిర్వహిస్తాం. ప్రతి ఒక్కరూ ప్రత్యామ్నాయ వస్తువులు వినియోగించాలి.

– సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్, రేపల్లె

రైతులు కలుపు రాకుండా చూసుకోవాలి



గోవాడ కార్యక్రమంలో పాల్గొన్న ఏవో హేమంత్



అరవపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఏవో మహేష్‌బాబు

అమర్తలూరు(వేమూరు): పైరు నాటిన 40 రోజుల వరకు కలుపు రాకుండా రైతులు చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.హేమంత్ భారత్ కుమార్ తెలిపారు. అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కలుపు యాజమాన్య పద్ధతిని రైతులకు తెలిపారు. కలుపు రాకుండా రైతులు చూసుకోవాలని.. కలుపు నివారణ చర్యలను వివరించారు.కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి పి.సువర్ణరావు, వ్యవసాయ విస్తరణ అధికారి డి.మాధవి, రైతులు పాల్గొన్నారు.

రేపల్లె: వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ సాగులో కలిగే సందేహాలు నివృత్తి చేయాలని రేపల్లె వ్యవసాయ అధికారి మహేష్‌బాబు చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని అరవపల్లి గ్రామంలో బుధవారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ క్రాపింగ్ బుకింగ్ విధానం, ఇన్సూరెన్సులు, అన్నదాత సుఖీభవ తదితర అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు లక్ష్మణసాయి, రైతులు పాల్గొన్నారు.

వేమూరు: వెద పద్ధతి వరిపంట 25 రోజుల దశలో ఉందని.. రైతులు కలుపు నివారణకు బిస్పైరిబాక్ సోడియం సాల్ట్ ఎకరానికి 90 గ్రాములు పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్ సాగర్ తెలిపారు. వేమూరు మండల కేంద్రంలోని చావలి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎరువుల కొరత లేకుండా అందిస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



చినపరిమి కార్యక్రమంలో పాల్గొన్న ఏవో

చుండూరు(వేమూరు): ఖరీఫ్ సీజనలో వరిపంట సాగు చేస్తున్న రైతులు బీమాను ఈనెల 15వ తేదీ లోపు చెల్లించాలని మండల వ్యవసాయాధికారి ఆదాం బాబు తెలిపారు. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి


బాపట్ల అర్బన్: పట్టణంలో ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలోని ఆరోగ్యశాఖ సిబ్బందితో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణంలో ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహించాలని సూచించారు. ఎక్కడైనా జ్వరాలు ఉంటే వెంటనే సంబంధిత వైద్యశాలకు పంపాల్సిందిగా ఆయన తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని.. వాటిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారిణి డాక్టరు విజయమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



తెనాలి అర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు లయన్ కిక్కూరి చిన్న కృష్ణారెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ఐతానగర్‌లోని డగ్లస్ మెమోరియల్ రెసిడెన్షియల్ ఎలిమెంటరీ స్కూల్‌లోని విద్యార్థులకు బుధవారం రాత పుస్తకాలు, పలకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు లయన్ కాకరపర్తి సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు నేరెళ్ల వెంకటకృష్ణ మోహన్‌రావు, అయినాల మల్లేశ్వరరావు, హెచ్‌ఎం చావలి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చుండూరు మృతవీరులకు నివాళులు



తెనాలి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం చుండూరు మృతవీరులు, ప్రముఖ వాగ్గేయకారుడు గద్దర్‌కు పలువురు నివాళులర్పించారు. స్థానిక రైల్వేస్టేషన్ దగ్గర్లోని కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చుండూరులో దళితుల హత్యాకాండ, అనంతర పరిణామాలపై చర్చించారు. మృతవీరులకు నివాళి అర్పించి పలువురు మాట్లాడారు. తన మాట, పాటలతో ప్రజా చైతన్యాన్ని కలిగించిన ప్రజాయుద్ధనౌక గుమ్మడి విఠల్‌రావు (గద్దర్) అని కొనియాడారు. తన పాటలతో సమాజాన్ని నిరంతరం జాగృతం చేసిన వ్యక్తి గద్దర్ అని అన్నారు. ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు షేక్ దుబాయ్ బాబు, యాతాటి అనిల్, కమాదుల స్వామి, గోపి తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో మోసం గ్యారెంటీ



అబ్బనగూడవల్లి కార్యక్రమంలో దాది సుబ్బారావు

వేమూరు: కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు రైతు భరోసా అందించడం లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దాది సుబ్బారావు తెలిపారు. వేమూరు మండలంలోని అబ్బనగూడవల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కౌలు రైతులకు రైతు భరోసా ఇచ్చారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం కౌలు రైతులను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి రాంబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కనపర్తి నిరీక్షణరావు, చిక్కాల రాణి బాబు, గోళ్ల పాములు, శీలం శెట్టి సుబ్బారావు, కొండే శెట్టి సాంబయ్య, బోరుగడ్డ జయరావు, కనపర్తి అరుణ్, కనపర్తి ఎషియ్య, బోరుగడ్డ శ్రీను, కనపర్తి కిరణ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడిపర్రు గ్రామంలో..

వేమూరు: సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని మండల పార్టీ అధ్యక్షులు దాది సుబ్బారావు తెలిపారు. వేమూరు మండలంలోని కోడిపర్రు గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం రైతులను దోచుకునే ప్రభుత్వం అని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి పిల్లి సామ్రాజ్యం, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిన్నం సంగీతరావు, బుస్సా చింతయ్య, పల్లి బాజీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలి

ఏపీజీఈఏ తెనాలి అధ్యక్షుడు శ్రీనివాసరావు



తెనాలి అర్బన్: ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెనాలి తాలుకా యూనిట్ అధ్యక్షుడు శివరాత్రి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఏపీజీఈఏ తెనాలి శాఖ ఆధ్వర్యంలో 'రండి టీ తాగుతూ మాట్లాడుదాం' కార్యక్రమాన్ని బుధవారం జిల్లా వైద్యశాల వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి కారుమూరి కమల కుమారి, దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందే బాలచంద్రమౌళి, నాయకులు దీపాల శ్రీనివాసరావు, దగ్గుబాటి సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు మంచి పౌష్టికాహారం



సమావేశంలో మాట్లాడుతున్న హేమలత

తెనాలి టౌన్: తల్లిపాలు బిడ్డకు మంచి పౌష్టికాహారం అని జేఎంజే మహిళా కళాశాల హోమ్ సైన్సు విభాగాధిపతి పి.హేమలత తెలిపారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక 23వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిపాల ఆవశ్యకత, వాటితో కలిగే ప్రయోజనాలను తల్లులకు వివరించారు. తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని అన్నారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం అని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వై.నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధరలు పేదలకు అందుబాటులో ఉండాలి



సాంబశివరావుకు వినతిపత్రం అందజేస్తున్న పట్టణ ఆదర్శ వేదిక సభ్యులు

రేపల్లె: పట్టణంలోని మూడో వార్డులో నూతనంగా నిర్మితమైన రాణిగారి సత్రంలో ధరలు పేదలకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతూ పట్టణ ఆదర్శ వేదిక సభ్యులు బుధవారం మున్సిపల్ కమిషనర్ సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన అనంతరం పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ ఎడ్లపల్లి కిషోర్ మాట్లాడారు. పట్టణంలో సొంత గృహంలేని పేదల కుటుంబాలలో ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబ సభ్యులు ఉండడానికి రాణిగారి సత్రం గతంలో అందుబాటు ఛార్జీలతో చక్కటి వేదికగా ఉందన్నారు. అయితే ప్రస్తుతం నూతనంగా నిర్మించిన రాణిగారి సత్రంలో ధరలు అధికంగా వసూలు చేయడంతో పేదలకు ఆర్థిక భారం అవుతుందన్నారు. గతంలో మాదిరిగా ధరలను తగ్గించి పేదలపై ఆర్థిక భారం పడకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఆదర్శవేదిక సభ్యులు మోహనరావు, వెంకటేశ్వర్లు, ఆనందరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

ఎస్ఐ తిరుపతిరావు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తిరుపతిరావు

నిజాంపట్నం: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని నిజాంపట్నం ఎస్ఐ కందుల తిరుపతిరావు అన్నారు. మండల కేంద్రమైన నిజాంపట్నం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో బుధవారం యాంటీ డ్రగ్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో యువత డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటుదన్నారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల బంగారు భవిష్యత్తు నాశనమవడమే కాకుండా ఆరోగ్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను తెలుసుకుని వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, డ్రైవింగ్, ఈవ్‌టీజింగ్ వంటి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల పోషణపై తల్లులు దృష్టి సారించాలి



బొద్దులూరుపాడులో అవగాహన ప్రదర్శన



చుండూరు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు

కొల్లూరు: పసి పిల్లల పోషణపై తల్లులు దృష్టి సారించి వారికి సమయానుకూలంగా అవసరమైన ఆహారం అందజేయాలని ఐసీడీఎస్ కొల్లూరు, అనంతవరం సెక్టార్ల సూపర్‌వైజర్ రజని అన్నారు. బుధవారం మండలంలోని బొద్దులూరుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను పునస్కరించుకొని గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన పిల్లలకు తల్లి పాలను పట్టించడంతో వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే బలవర్థక ఆహార పదార్థాలను గర్భిణులు, బాలింతలు తప్పని సరిగా వినియోగించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నాగరాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

చుండూరు(వేమూరు): తల్లులు బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టాలని.. శిశువుకు మొట్ట మొదటి వ్యాధి నిరోధక టీకాలా ఆ పాలు పనిచేస్తాయని అంగన్‌వాడీ కేంద్రం సూపర్‌వైజర్ జి.శంకుతల, పద్మావతి తెలిపారు. చుండూరు మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, పిల్లకు అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్స్, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

దమ్ము చక్రాలతో రహదారులు ఛిద్రం!



ఏటా ఖరీఫ్ సీజన్‌లో దమ్ము చక్రాల ట్రాక్టర్లు రహదారులపై తిరుగుతుండడంతో రహదారులు ఛిద్రమవుతున్నాయి. దమ్ము చక్రాలకు ప్రత్యేకంగా బద్దెలను ఏర్పాటు చేసి పంట పొలాలకు తీసుకువెళ్లిన తరువాత బద్దెలు తీసి వేస్తే ఈ సమస్య ఉండదు. కానీ.. రైతాంగం దీనిని ఆచరించడంలేదు. దమ్ము చక్రాలకు ఉండే బురద రహదారిపై పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. రహదారులపై దమ్ము చక్రాల ట్రాక్టర్లను తిప్పితే చర్యలు తీసుకుంటామని ఆర్అండ్ బీ, రెవిన్యూ శాఖలు ప్రకటనలు చేయడమే తప్పా.. ఆచరణలో కానరావడం లేదన్న విమర్శలూ వినబడుతున్నాయి. – భట్టిప్రోలు

హిరోషిమా విధ్వంసం పునరావృతం కాకూడదు

స్లైడ్, వీడియో ప్రదర్శనలో ఐకా బాలాజీ

తెనాలి: 'ప్రపంచానికి అణ్వస్త్రాలు వద్దు.. అన్నవస్త్రాలు కావాలి' అనే నినాదంతో కోల్‌కత్తాకు చెందిన వైజ్ఞానిక-సాంస్కృతిక సేవాసంస్థ 'ముందడుగు' వ్యవస్థాపకుడు ఐకా బాలాజీ ఆధ్వర్యంలో హిరోషిమా విధ్వంసంపై స్లైడ్ వీడియో ప్రదర్శనను నిర్వహించారు. జనసాహితి సంస్థ సహకారంతో హిరోషిమా డేను బుధవారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ వివేకానంద సెంట్రల్ స్కూల్ ఆడిటోరియంలో ఈ ప్రదర్శనను ఏర్పాటుచేశారు. రెండో ప్రపంచ యుద్ధంలో ఆగస్టు 6న అమెరికా తన ప్రత్యర్థి దేశమైన జపాన్‌లోని హిరోషిమా నగరంపై 15 కిలో టన్నుల అణుబాంబుతో దాడిచేసినట్లు బాలాజీ తెలిపారు. దీంతో హిరోషిమా నగరం సర్వనాశనం కాగా.. మూడున్నర లక్షల మంది ప్రజలు మరణించారనీ, అణుధార్మికతతో లక్షలాది ప్రజలు దశాబ్దాలపాటు అనేక వ్యాధులు, శారీరక, మానసిక రుగ్మతలు, అంగవైకల్యాలతో హృదయవిదారకమైన జీవితాలను గడిపారని చెప్పారు.

500 పైగా ప్రదర్శనలు..

మానవాళికి పెనుముప్పుగా, మానవత్వానికి మాయని మచ్చగా నిలిచిన హిరోషిమాపై దాడులు వంటివి పునరావృతం కారాదనే సందేశాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతో నాటి విధ్వంసం, అనంతర పరిణామాలతో ఈ ప్రదర్శనను రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. గత 35 ఏళ్లుగా 500 పైగా ప్రదర్శనలతో ప్రజలను చైతన్య పరుస్తున్న బాలాజీ, నిర్మలను వివేక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు, సీఈవో వెంకట్రామ్ ఘనంగా సత్కరించారు. ఇదే వేదికపై తమ భావాలను తెలియజేసిన విద్యార్థులు మోక్షజ్ఞ, పరిమళ, జుయెల్, శ్రావ్యలను అభినందించారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ పర్యవేక్షించగా, శివకుమార్, మురళీ, చౌదరి సహకారం అందించారు.